సాక్షి
నల్లగొండ
7
బుధవారం । 22 । మార్చి । 2023



మోసగిస్తున్న ముఠా అరెస్ట్

నకిలీ బంగారం అంటగడుతూ మోసాలకు పాల్పడుతున్న ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో





సకల శుభాల శోభకృత్

వేప తియ్యగా నవ్వుతుంది.. తలనిండా నక్షత్రాలను పులుముకుని
చెరకుగడ అహపుచెక్కును విదుల్చుకొని చేదును మనసారా కౌగిలించుకుంటుంది.
కారం వగరూ మమకారాన్ని, ఉప్పూ పులుపూ వలపును వాయినాలిచ్చుకుంటాయి.
శ్రీ శోభకృత్ నామసంవత్సర ఉగాది..
అందమైన ఆకాంక్షలు కలబోసుకున్న ఆనందాల పునాది

– అరవిందరాయుడు దేవినేని, ఉపాధ్యాయుడు

న్యూస్‌రీల్

ఉగాది శుభాకాంక్షలు

• మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్: ప్రకృతి అందించే షడ్రుచుల సమ్మేళనానికి ఉగాది పర్వదినం ప్రతీక అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. అదే ప్రకృతి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు ఆయన శ్రీ శోభకృత్ తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. స్వరాష్ట్రంలో సుపరిపాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆశీస్సులతో ఉమ్మడి నల్లగొండ జిల్లా మరింత పురోగతి సాధిస్తుందని మంత్రి ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

శ్యాంసుందర్‌రెడ్డికి పద కవి మిత్ర అవార్డు



శ్యాంసుందర్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న ఆర్.నారాయణమూర్తి

నల్లగొండ టౌన్: బొట్టుగూడ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు డాక్టర్ ఎలక శ్యాంసుందర్‌రెడ్డికి ఏపీ సాహిత్య అకాడమీ, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం పద కవిమిత్ర, నంది అవార్డులను ప్రదానం చేశారు. మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగిన ఉగాది నంది పురస్కారాల సందర్భంగా ఈ అవార్డులను సినీనటుడు ఆర్.నారాయణమూర్తి, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ దృశ్యకళల అకాడమీ చైర్మన్ సత్యశైలజ, కత్తి ముండేలు చేతుల మీదుగా అందజేశారు.

1,600 అర్జీలు పరిష్కారం

• నీలగిరిలో ఏడాదిగా సాగుతున్న రెవెన్యూ మేళా
• అధిక ఆస్తిపన్ను, ఇంటి నంబర్లను సవరిస్తున్న మున్సిపల్ యంత్రాంగం
• ఈ నెలాఖరుతో ముగియనున్న మేళా
• సద్వినియోగం చేసుకోవాలంటున్న సిబ్బంది



నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీలో ఏడాది కాలంగా నిర్వహిస్తున్న రెవెన్యూ మేళాతో వివిధ సమస్యలను అధికారులు పరిష్కరిస్తున్నారు. పట్టణంలో దశాబ్దకాలంగా అధిక ఆస్తి పన్ను, యజమాని పేర్లు, ఇంటి నంబర్ల తప్పు లాంటి సమస్యలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గతేడాది మార్చి నుంచి మున్సిపల్ యంత్రాంగం రెవెన్యూ మేళా నిర్వహిస్తోంది. ఈ మేళాకు ఇప్పటి వరకు సుమారు 1,600ల దరఖాస్తులు రాగా వాటన్నింటిని పరిష్కరించారు.

సవరణలు ఇలా..

నీలగిరి పట్టణంలో ఆస్తి పన్ను హెచ్చు, తగ్గుదల, ఇళ్ల యజమానుల పేర్ల సవరణ లాంటి సమస్యలపై వందల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. గతేడాది మార్చి నుంచి ఆస్తి పన్ను సవరణలకు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు పదహారొందల దరఖాస్తులు రాగా వాటన్నింటిని పరిశీలించి పరిష్కరించారు. వీటిలో ఎక్కువగా ఒక ఇంటికి రెండు నంబర్లు, అధిక ఆస్తి పన్ను సంబంధించినవే ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఇకనుంచి రెవెన్యూ విభాగంలో తప్పులు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆస్తి పన్ను మదింపు సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో చోటుచేసుకున్న చిన్న, చిన్న తప్పులకు భవన యజమానులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తప్పులు చిన్నవే అయినా వాటిని సరి చేయాలంటే హైదరాబాద్‌లోని డీఎంఏ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దాంతో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యానికి రెవెన్యూ మేళాతో చెక్ పెట్టారు.

వారం రోజులే గడువు

నీలగిరిలో నిర్వహిస్తున్న రెవెన్యూ మేళా గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనుంది. వారంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. గడువు ముగిసిన ఆ తరువాత ఈ మేళా ఉండే అవకాశం లేదని, ఇప్పుడే మేళాను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



ఆస్తి పన్ను హెచ్చు, తగ్గులు, ఇంటి యజమాని పేర్లకు సంబంధించి సవరణల కోసం ఆధారాలతో సహా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 31తో రెవెన్యూ మేళా గడువు ముగియనుంది. మున్ముందు రెవెన్యూ విభాగానికి ఎలాంటి సమస్యలు రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం.

– కేవీ.రమణాచారి, మున్సిపల్ కమిషనర్

రుణాల వసూళ్లలో నిర్లక్ష్యం చేయొద్దు

• కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ: స్త్రీనిధి రుణాల రికవరీ విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో సెర్ప్, స్త్రీనిధి సిబ్బందితో బ్యాంక్ లింకేజీ రుణాల రికవరీ, ఇతర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీనిధి గ్రూపు సభ్యులతో సమావేశాలు నిర్వహించి ఇప్పటి వరకు తీసుకున్న రుణం ఎంత, ఎంత మొత్తం చెల్లించారు? ఇంకా ఎంత చెల్లించాలన్న విషయాలు తెలుసుకుని పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు డీఆర్‌డీఓకు పంపించాలన్నారు. గ్రామస్థాయిలో రుణాల రికవరీలో సీసీలు, ఏపీఎంలు కీలక పాత్ర పోషించాలన్నారు. అదేవిధంగా సీసీ నుంచి డీఆర్‌డీఓ వరకు సమన్వయంతో పనిచేస్తూ ఎక్కువ మొత్తంలో రుణాలు రికవరీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడవిదేవులపల్లికి ప్రత్యక్షంగా వెళ్లి అక్కడి పరిస్థితులపై చర్చించి తనకు పూర్తి సమాచారం అందజేయాలని డీఆర్‌డీఓను ఆదేశించారు. రికవరీలో వెనుకబడిన మండలాలు, గ్రామాలకు చెందిన ముఖ్యమైన సిబ్బందిని ఈ నెల 23న జిల్లా కేంద్రానికి పిలిపించాలన్నారు. ఏప్రిల్ 1న మళ్లీ సమీక్ష ఉంటుందని, అప్పటి వరకు పనితీరు మెరుగుపర్చుకోని వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ కాళిందిని, స్త్రీనిధి జోనల్ మేనేజర్ అనంత కిషోర్, సెర్ప్, స్త్రీనిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

483 మంది గైర్హాజర్

నల్లగొండ: జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్, బోటనీ, సివిక్స్ పరీక్షలను 15,207 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 14,724 మంది హాజరయ్యారు. 483 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు.

ఉగాది బోనం ప్రత్యేకం

• మోత్కూరులో 80 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ



ముత్యాలమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు (ఫైల్)

మోత్కూరు: తెలుగు నూతన సంవత్సర పర్వదినమైన ఉగాదికి యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీకి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడి ప్రజలు ఉగాది పండుగను బోనాలతో నిర్వహిస్తారు. పూర్వకాలం నుంచి ఈ పండుగను యేటా ఇలా వినూత్న రీతిలో జరుపుకుంటారు.

80 ఏళ్ల క్రితం మొదలైన ఆనవాయితీ..

సుమారు 80 ఏళ్ల క్రితం మోత్కూరులో కలరా ప్రబలి చాలా మంది చనిపోయారు. ఎంత వైద్యం చేసినా నయం కాకపోవడంతో అప్పట్లో ముత్యాలమ్మ తల్లి ఆగ్రహించిందని, బోనాలు సమర్పించాలని అప్పటి పెద్దలు నిర్ణయించారు. ఆ ఆచారం ప్రకారం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఊర ముత్యాలమ్మకు చలి బోనాలు సమర్పిస్తుంటారు. అలా మొదలైన పండుగ నేటికీ కొనసాగుతోంది. ఇక్కడ ఉగాదికి పచ్చడి, మద్యం, మాంసంతో పాటు ముత్యాలమ్మకు బోనాలు సమర్పిస్తారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎడ్ల బండ్ల ప్రదర్శనలు నిర్వహించి అక్కడికి చేరుకున్న బోనాలతో ముత్యాలమ్మకు నైవేద్యంగా పెడతారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం, జామచెట్లబావి, కొండాపురం గ్రామాల ప్రజలు కూడా గ్రామ దేవతలకు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పిస్తారు.

‘శ్రీశోభకృత్’ శోభాయమానంగా ఉండబోతుంది



యాదగిరిగుట్ట: శ్రీశుభకృత్ నామ సంవత్సరం అన్ని శుభాలను ఇచ్చింది. ఇక శోభకృత్ నామ సంవత్సరం మరింత శోభాయమానంగా ఉండబోతుంది. శుభకృత్ సంవత్సరంలో అద్భుతమైన యాదాద్రీశుడి ఆలయాన్ని పునః ప్రారంభించుకొని భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాదిలో భద్రాది రాముడి ఆశీస్సులతో పుష్కరాలు సైతం వస్తుండటం సంతోషకరం. ఇక ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రీశుడి ఆలయంలో ఉదయం షడ్రుచులతో శ్రీస్వామి వారికి కొత్త కుండలో నివేదిస్తాం. సాయంత్రం 5.30 గంటలకు తూర్పు మాఢ వీధిలోని బ్రహ్మోత్సవ మండపంలో పంచాంగ శ్రవణం ఉంటుంది.

– కాందూరి వెంకటాచార్యులు, యాదాద్రి దేవస్థానం ప్రధానార్చకుడు

వేపపూత కరువాయె..



ఎండిన వేప చెట్టు

మిర్యాలగూడ టౌన్: ఉగాది పండుగ వచ్చిందంటే ముందుగా గుర్తుకొచ్చేది షడ్రుచులు అయిన చేదు, తీపి, వగరు, పులుపు, కారం, లవణం మిశ్రమాలతో చేసే పచ్చడి. ఈ పచ్చడిని వేప పూత పాటు బెల్లం, మామిడి కాయ ముక్కలు, చింతపండు, కారం, ఉప్పు కలయికతో చేసి సేవించడం పూర్వ నుంచి వస్తున్న తెలుగు సంవత్సరాది ఆనవాయితీ. అయితే ఈ సారి ఉగాది పచ్చడి చేసేందుకు అంతటా వేప పూత కరువైంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా పూతన్న మాట కాదుకదా.. వేప చెట్లన్నీ ఎండిపోయి కనిపిస్తున్నాయి. ఫలితంగా ఈ ఏడాది ఉగాది పండుగ రోజు షడ్రుచులకు బదులు పంచ రుచుల పచ్చడినే సేవించాల్సిన పరిస్థితి దాపురించిందని పలువురు అంటున్నారు.

క్లుప్తంగా

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించి తగిన పరిష్కారమార్గం చూపాలని కోరారు. అభివృద్ధిలో భాగస్వాములు చేయాలని, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తేవాలని కోరారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ పీఓలు స్వామి, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల తీగలు చోరీ

మాడుగులపల్లి: మండల కేంద్రం శివారులోని వరద కాల్వకు విద్యుత్ మోటార్లు వేసి పంట సాగు చేసుకుంటున్న పలువురు రైతులకు చెందిన మోటార్ల తీగలు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. మంగళవారం ఉదయం విషయాన్ని గుర్తించిన రైతులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ కె గూరి నరేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా మండల కేంద్ర శివారులోని ఓ రైతు పొలం వద్ద తీగలను కాల్చిన ఆనవాళ్లు కనిపించడంతో దుండగులు తీగల్లోని రాగి కోసమే చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇదే తరహా చోరీలకు పాల్పడిన పెద్దదేవులపల్లికి చెందిన ముగ్గురు యువకులను ఇటీవల మాడుగులపల్లి పోలీసులు అరెస్టు చేసి రూ.70 వేల విలువైన రాగి తీగలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

హరితహారంపై నిర్లక్ష్యం వద్దు



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

కేతేపల్లి: హరితహారంపై నిర్లక్ష్యం చేయొద్దని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచి నాటేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగానికి 2023–24 సంవత్సరానికిగాను తయారు చేయాల్సిన యాక్షన్ ప్లాన్‌పై అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వివిధ పథకాల కింద మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ రమేష్ జీన్‌దయాల్, సూపరింటెండెంట్ భవాని, సీనియర్ అసిస్టెంట్ సులోచన, ఈజీఎస్ ఏపీఓ సురేందర్ తదితరులు ఉన్నారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు



టేకులసోమారం వద్ద చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు, నుజ్జునుజ్జయిన ముందు భాగం



ప్రమాదంలో గాయపడిన యువతిని హైదరాబాద్‌కు తరలిస్తున్న సిబ్బంది

- 20 మందికి తీవ్రంగా.. మరో 20మందికి స్వల్పగాయాలు
- పలువురి పరిస్థితి విషమం.. గాంధీ ఆస్పత్రికి తరలింపు
- యాదాద్రి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఘటన

వలిగొండ / భువనగిరి : ఆర్టీసీ బస్సు చెట్టుకు ఢీకొని 20మందికి తీవ్ర గాయాలు కాగా.. మరో 20మందికి స్వల్పగాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపి 24జెడ్ 0119) మంగళవారం నల్లగొండ నుంచి 40మంది ప్రయాణికులతో భువనగిరికి బయలుదేరింది. మార్గమధ్యలో వలిగొండ మండలంలోని టేకులసోమారం వద్ద రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చిన చిన్నారిని తప్పించబోయి బస్సు డ్రైవర్ పక్కనే ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులందరికీ గాయాలయ్యాయి. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనాల్లో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన 20మంది మినహా స్వల్పగాయాలైన వారు ప్రమాద స్థలం నుంచే వేరే వాహనాల్లో స్వస్థలాలకు వెళ్లిపోయారు.

అరగంటకు పైగా బస్సులోనే ఇరుక్కున్న డ్రైవర్

ప్రమాదానికి గురైన బస్సులోని డ్రైవర్ క్యాబిన్ స్టీరింగ్‌కు మధ్యన ఇరుక్కుని అరగంటకు పైగా బాధపడ్డాడు. పోలీసులు, ప్రజలు డ్రైవర్ లింగ్యానాయక్‌ను అతి కష్టం మీద బయటకు తీశారు. అతనిని వెంటనే పోలీసు వాహనంలో భువనగిరి ఆసుపత్రికి తరలించారు.

భువనగిరి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స

టేకులసోమారం గ్రామం వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన బాధితులను నాలుగు అంబులెన్స్‌లలో భువనగిరి ఆస్పత్రికి తీసుకువచ్చారు. సుమారు 20మందిని ఆస్పత్రికి తీసుకువచ్చారు. వెంటనే వారికి వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ఇందులో పలువురు మహిళలతో పాటు వంశిక అనే చిన్నారి ఉంది. అయితే వారి పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారిని వివిధ పార్టీలకు చెందిన నాయకులు పరామర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు.



గాయపడిన డ్రైవర్ లింగ్యానాయక్





ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులకు ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన మోదీ



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రంలో జెడ్పీ చైర్మన్లు తదితరులు

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

రామన్నపేట: ప్రధాని మోదీ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీసి దేశ సంపదను అదానీ, అంబానీ వంటి దోస్తులకు దోచిపెడుతున్నారని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం రామన్నపేటలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకులను నిలదీయాలన్నారు. దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దిక్కుమొక్కు లేని పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను భారీ మెజార్టీతో తిరిగి గెలిపించుకునే బాధ్యత పార్టీశ్రేణులపై ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కేంద్రంలోని మోదీ సర్కార్ అడ్డుకుంటుందన్నారు. సమ్మేళనానికి ముందు రైస్ మిల్లు నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమ్మేళనంలో జెడ్పీచైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి డైరెక్టర్ ఒంటెద్దు నర్సింహారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గుత్తా నర్సింహారెడ్డి, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, పోతరాజు సాయి, సర్పంచ్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కబేళాకు తరలిస్తున్న ఆవుల పట్టివేత

కోదాడరూరల్ : అక్రమంగా తరలిస్తున్న ఆవులను కోదాడ రూరల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని హనుమాన్‌జంక్షన్ సంత నుంచి 17 ఆవులను డీసీఎంలో హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్ట కబేళాకు తరలిస్తున్నారు. మార్గమధ్యలోని రాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్‌రోడ్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ఆవులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించారు. డీసీఎం ఓనర్ ఇమ్రాన్ ఖురేషి, డ్రైవర్ ఖరీంతో పాటు మరోవ్యక్తి అలీంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

ఆస్పత్రి ఎదుట ఆందోళన

- వైద్యం అందక శిశువు మృతిచెందిందని ఆరోపణ



వైద్యులతో వాగ్వాదం చేస్తున్న శిశువు బంధువులు

దేవరకొండ : సకాలంలో వైద్యం అందించక శిశువు మృతిచెందిందని ఆరోపిస్తూ మంగళవారం కుటుంబ సభ్యులు, బంధువులు దేవరకొండ ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ పట్టణానికి చెందిన నోముల అఖిలకు మొదటి కాన్పులో పురిటి నొప్పులు రావడంతో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. విధుల్లో ఉన్న డాక్టర్లు శశికళ, కృష్ణలు అఖిలను పరీక్షించి అప్పటికే కడుపులో ఉన్న శిశువు మృతిచెందినట్లు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం అఖిలను నల్లగొండకు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో హుటాహుటిన అంబులెన్స్ వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి వద్ద అఖిల ఆడ శిశువుకు జన్మనిచ్చింది .కాగా అప్పటికే శిశువు మృతిచెందింది. ఇదిలా ఉంటే సకాలంలో వైద్యం అందకనే శిశువు మృతిచెందిందని బంధువులు ఆరోపించి కొద్దిసేపు ఆందోళనకు దిగి.

ఆరోపణలు అవాస్తవం

అఖిలకు పూర్తిస్థాయి వైద్యం అందించామని, మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు రెఫర్ చేసినట్లు వైద్యులు రవి, కృష్ణ తెలిపారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేదని పేర్కొన్నారు. దీంతో అఖిల బంధువులు మృతశిశువును తీసుకొని వెళ్లిపోయారు.

ఆవులమందపైకి దూసుకెళ్లిన బస్సు

- 14 ఆవులు మృతి



ఘటనా స్థలంలో ఆవుల కళేబరాలు

వేములపల్లి : వలస జీవుల జీవనాధారమైన పశువులను కాపరులు గ్రాసం కోసం తోలుకెళ్తుండగా బస్సు ఆవుల మందపైకి దూసుకురావడంతో 14 ఆవులు మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన వేములపల్లి మండలంలోని బుగ్గబావిగూడెం గ్రామ శివారులో గల నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. ఇదే జిల్లాలోని నేరేడుగొమ్ము, కాచరాజుపల్లి, బండమీదితండాకు చెందిన ఆరుగురు రైతులు సుమారు 300 ఆవుల మందతో వేములపల్లి నుంచి నల్లగొండ వైపు వెళ్తుండగా మండల కేంద్రం సమీపంలోని బుగ్గబావిగూడెం గ్రామం వద్ద రహదారిపై హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తున్న భారతి ట్రావెల్ బస్సు ఆవుల మందను ఢీకొట్టింది. దీంతో 14 ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన ఆవుల విలువ రూ.6 లక్షలు ఉంటుందని, తమకు జీవనాధారమైన పశువులను కోల్పోయి బజారునపడ్డ తమకు బస్సు యజమానుల నుంచి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరారు. కాగా, పొగమంచు కారణంగా రోడ్డుపై ఆవులు కనిపించగా ఒక్కసారిగా బస్సు ఆవుల మందపైకి దూసుకువచ్చినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఆవుల కళేబరాలతో రహదారి నిండిపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మర్రిగూడ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన వల్లెంల ముత్తయ్య(50) విద్యుత్ కాంట్రాక్టర్ కింద ప్రైవేట్ పనులు చేసేవారు. తన అత్త అనారోగ్యంగా ఉందని భార్య ముత్తమ్మను తీసుకుని ఈ నెల 18న బైక్‌పై మర్రిగూడకు బయలుదేరాడు. మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొత్త శివ(21), ఎడ్ల రాజుతో కలిసి ఎదురుగా వస్తూ పురేనాగుట్ట మూలమలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ముత్తయ్య అతని భార్య ముత్తమ్మ, శివలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే వల్లెంల ముత్తయ్య మృతిచెందాడు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో రెండు రోజులుగా చికిత్స పొందుతున్న కొత్త శివ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం యరగండ్లపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

పుణ్యస్నానం ఆచరిస్తూ పరలోకాలకు..

- యాదాద్రి లక్ష్మీ పుష్కరిణిలో మునిగి భక్తుడు మృతి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండ దిగువన గల లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తున్న ఓ భక్తుడు నీట మునిగి మృతిచెందాడు. స్థానికులు, ఆలయ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మౌలాలి (19) తన తల్లి ఖాజాభానుతో కలిసి మంగళవారం యాదాద్రీశుడి చెంతకు వచ్చాడు. ఈ క్రమంలో ఉదయం 9గంటల ప్రాంతంలో మౌలాలి గండిచెరువు సమీపంలోని లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వెళ్లాడు. మౌలాలికి ఈత రాకపోవడం, అదే సమయంలో ఫిట్స్ రావడంతో నీటిలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న భక్తులు గమనించి అతడిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఊపిరి ఆడకపోవడంతో విగతజీవుడయ్యాడు. ఘటనా స్థలాన్ని యాదగిరిగుట్ట ఎస్ఐ చంద్రశేఖర్, దేవస్థానం పోలీస్ సిబ్బంది పరిశీలించారు. మృతదేహానికి భువనగిరి ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి ఖాజాభాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పుష్కరిణిలో భక్తుడు మృతిచెందిన నేపథ్యంలో ఆచార్యులు సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం భక్తుల పుణ్యస్నానాలకు అనుమతించారు.

నకిలీ బంగారంతో మోసగిస్తున్న ముఠా అరెస్ట్

- ముఠా సభ్యుల నుంచి రూ.2లక్షల నగదు, 3కేజీల నకిలీ బంగారు గొలుసులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావు



ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అపూర్వరావు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు

నల్లగొండ క్రైం : నకిలీ బంగారం అంటగడుతూ మోసాలకు పాలపడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2లక్షల నగదు, 3 కేజీల నకిలీ బంగారు గొలుసులు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వరావు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన పంచారామ్ అలియాస్ పంచ్, అలియాస్ సోనా అలియాస్ సోనాజీ, గులాబ్ రామ్, ఉమారాం అలియాస్ తేజాజీలు సమీప బంధువులు. ముగ్గురు ఒక ముఠాగా ఏర్పడి నకిలీ బంగారాన్ని అసలైన బంగారంగా నమ్మిస్తూ ప్రజలను మోసం చేయాలని ప్లాన్ వేశారు. ప్లాస్టిక్ పూల దండలు అమ్మేందుకు ముగ్గురు కలిసి ఇటీవల కొండమల్లేపల్లికి వచ్చారు. అక్కడినుంచి పీఏపల్లి మండలం అంగడిపేటకు వెళ్లా ధర్మరాజు కిరాణం షాపులో బంగారం బిల్లలను కొనాలని కోరడంతో అందుకు అతను నిరాకరించాడు. ఈనెల 5న మళ్లీ అదే షాపు యజమాని వద్దకు వెళ్లి గుంటూర్‌లో కూలి పనికి వెళ్లి పునాది పనులు చేస్తుండగా బంగారు హారం దొరికిందని ధర్మరాజుకు చూపించారు. గొలుసులో మూడు బిల్లలను తీసి ఇవ్వగా తెలిసిన వారి వద్దకు వెళ్లి చూపించగా అది నిజమైన బంగారమని తెలుసుకున్నాడు. అయితే ఈనెల 8న దేవరకొండకు రమ్మని ముఠా సభ్యులు ఫోన్‌లో చెప్పడంతో రూ.3లక్షలు తీసుకొని అక్కడకు వెళ్లగా నగదు తీసుకొని నకిలీ బంగారం ఇచ్చారు. అదే విధంగా మల్లేపల్లికి చెందిన బ్రాండ్ ఫ్యాక్టరీ గార్మెంట్ షాప్‌కు చెందిన శేషయ్య వద్దకు ఈనెల 20న వెళ్లి నకిలీ బంగారు గొలుసును చూపి ధర్మరాజుకు చెప్పినట్లుగా చెప్పి నమ్మబలికారు. గొలుసును పరిశీలించిన శేషయ్య డబ్బులు తెస్తానని చెప్పి షాపు నుంచి బయటకు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే వచ్చి దొంగల ముఠా సభ్యులను పట్టుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నకిలీ బంగారాన్ని అసలు బంగారంగా చెప్పే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కోరారు. బంగారాన్ని పోలిన ముక్కలను రోడ్డుపైన వేసి దృష్టి మళ్లించి ఒంటిపై ఉన్న బంగారాన్ని దోచుకెళ్తారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే సంబంధిత పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఆమె అభినందించారు. సమావేశంలో దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వీరబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై కరస్పాండెంట్ లైంగిక వేధింపులు

- పాఠశాల ఎదుట విద్యార్థినులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన
- కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు.. అరెస్ట్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

భువనగిరి : విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్లో 41మంది విద్యార్థులు పదో తరగతి అభ్యసిస్తున్నారు. వార్షిక పరీక్షల నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా, ఈ నెల 19వ తేదీన రోజు మాదిరిగా ప్రత్యేక తరగతులు ముగిసిన అనంతరం ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు అయితే, అందులో ఓ విద్యార్థిని కుటుంబ సభ్యులు రాకపోవడాన్ని అదునుగా భావించిన కరస్పాండెంట్ రఘు వెంకటసురేష్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించాడు. అనంతరం ఆ విద్యార్థిని ఆలస్యంగా ఇంటికి వెళ్లింది. అదే రోజు పాఠశాలలో కరస్పాండెంట్ రఘువెంకటసురేష్ కుమార్ తన అసభ్యంగా ప్రవర్తించినట్లు తల్లిదండ్రులకు చెప్పింది. అనంతరం ఈ నెల 20వ తేదీన పదో తరగతికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఇదే విషయాన్ని చెప్పారు. దీంతో వీరంతా మంగళవారం మధ్యాహ్నం పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలలను వదిలిపెట్టే సమయంలో పదో తరగతిలోని 20 మంది విద్యార్థినులు గేటు ఎదుట నిరసనకు దిగారు. వీరికి పలు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కరస్పాండెంట్‌తో వాగ్వాదానికి దిగారు. సమాచారం తెలుసుకున్న బాలల పరిరక్షణ అధికారులు, డీఈఓ నారాయణరెడ్డి, డీసీపీ భువనగిరి జోన్ డీసీసీ రాజేశ్ చంద్ర, ఏసీపీ వెంకట్‌రెడ్డి తదితరులు పాఠశాలలోనే పదో తరగతి విద్యార్థినులతో ప్రత్యేకంగా తరగతి గదిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలల పరిరక్షణ విభాగం అధికారి సైదులు ఫిర్యాదు మేరకు కరస్పాండెంట్ రఘువెంకటసురేష్, ప్రిన్సిపాల్ సుజాతను అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. పాఠశాలలో ఘటకు సంబంధించిన విషయాలను సీసీ పుటేజ్ నుంచి తొలగించారని, సాంకేతిక నిపుణులను తీసుకువచ్చి తిరిగి రికార్డును తీసుకునే ప్రయత్నం చేస్తామన్నారు.

'మనబడి'పనులు త్వరగా పూర్తిచేయాలి : అదనపు కలెక్టర్

వేములపల్లి: మనఊరు– మనబడి కార్యక్రమంలో భాగంగా మండలానికి రెండు చొప్పున జిల్లాకు మంజూరైన 62 మోడల్ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా ఆదేశించారు. మంగళవారం మండలంలోని శెట్టిపాలెం, రావులపెంట గ్రామాల్లోని పాఠశాలలను ఆమె సందర్శించి పనులను పరిశీలించి మాట్లాడారు. ఈనెల చివరి నాటికి రెండు పాఠశాలలను ప్రారంభించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ రెండు పాఠశాలల్లో మొక్కలను నాటి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజ్మీరాదేవిక, ఎంఈఓ బాలాజీనాయక్, సర్పంచ్‌లు మజ్జిగపు పద్మసుధాకర్‌రెడ్డి, చొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని మహిళా ప్రాంగణంలో గల దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో చైల్డ్ కేర్ టేకర్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ అసోసియేట్ ఉద్యోగాలకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ ఏ.అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ వరకు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. వివరాలకు 76600 22517, 08682 244416 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

గురుకులంలో గోడకూలిన ఘటనలో మరో విద్యార్థి మృతి

- రెండుకు చేరిన మృతుల సంఖ్య
- శాలిగౌరారం మండలంలో విషాదం



యశ్వంత్ (ఫైల్)

శాలిగౌరారం/ చివ్వెంల: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలో నిర్వహిస్తున్న నాగారం బీసీ గురుకుల పాఠశాల (జ్యోతిరావుపూలే రెసిడెన్షిల్ పాఠశాల)లో ఈ నెల 16న నీటి ట్యాంకు గోడ కూలిన ప్రమాదంలో చికిత్స పొందుతూ మరో విద్యార్థి మృతిచెందాడు. వాటర్ ట్యాంకు వద్ద స్నానం చేస్తున్నప్పుడు జరిగిన ఈ ప్రమాదంలో 5వ తరగతి విద్యార్థి మోతె మండలం అప్పన్నగూడెంకు చెందిన రావుట్ల పవన్ అక్కడికక్కడే మృతిచెందగా.. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని శాలిలింగోటానికి చెందిన కొప్పుల యశ్వంత్(10)కు తీవ్ర గాయాలు కావడంతో వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఆరు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యశ్వంత్ మంగళవారం మృతిచెందాడు. యశ్వంత్ కుడి కాలు పాదం పూర్తిగా తెగి నుజ్జునుజ్జు కావడంతో శస్త్రచికిత్సలు చేసి తెగి దెబ్బతిన్న కాలు పాదాన్ని అతికించేందుకు వైద్యులు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో ఆదివారం రోజు పాదంపై వరకు తొలగించారు. ఆ తర్వాత నుంచి యశ్వంత్ ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడటంతో యశ్వంత్ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు హాస్పిటల్ వద్ద ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించింది. శాలిలింగోటానికి చెందిన కొప్పుల కిరణ్–సత్యవతి దంపతులకు కుమారుడు యశ్వంత్(10), కుమార్తె ఉన్నారు. వీరు బతుకుదెరువు కోసం రెండేళ్ల క్రితం నల్లగొండకు వలస వెళ్లారు. యశ్వంత్‌కు చివ్వెంల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో సీటు రావడంతో అక్కడకు పంపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో ఉన్న యశ్వంత్ మృతదేహాన్ని రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి మల్లయ్యభట్టు సందర్శించారు. యశ్వంత్ మృతికి నష్టపరిహారంగా రూ. 30 లక్షలు ఇవ్వాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు డబుల్‌బెడ్‌రూం ఇల్లు, దళితబంధు పథకం అమలు చేయాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు యశ్వంత్ తండ్రి శ్రీనుకు గురుకుల విద్యా సంస్థలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం యశ్వంత్ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పరశురామ్ యశ్వంత్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.